# ఏకాంతంగా కాంత

శ్రీ నాయుడు వెంకటసీతారామమూర్తి

రైల్వేప్లాట్‌ఫారం అంతా కిక్కిరిసి పోయింది. ప్రయాణీకుల కోలాహలం, ఖోజాకాయలచప్పుడు, పళ్లవర్తకుల కేకలతో ప్లాట్‌ఫారం సందడిగా ఉంది.

రాజు బెడ్డింగు వేసుకు కూర్చున్నాడు. చేతిగడియారం చూశాడు. రెండుగంటలయింది. ఇంకా మెయిల్ రాలేదు. ఎంత లేటో కనుక్కుందామని స్టేషనుమాష్టరు రూముకుదగ్గరగా వెళ్లేడు. బోర్డుమీద 90 నిముషాలు లేటని ఉంది. ఆ నిముషాల్ని గంట్లోకి మార్చుకున్నాడు. గంటన్నర లేటు.

రాజుకి ఏమీతోచిందికాదు. యింత కాలాన్ని గడపడంఎలా? పోనీ ఏదైనా చదువుకుందామంటే దగ్గరపుస్తకాలులేవు. వెంటనే డిటెక్టివ్ సాహిత్యంమీదకుదృష్టి వెళ్లింది. బుక్‌స్టాల్‌కివెళ్లి నవలలన్నీతిరగేశాడు. "హత్యా? ఆత్మహత్య?" హత్యపై హత్య, బుట్టలో హత్య, జేబులో హత్య, హంతుకుని హత్య, హైకోర్టులో హత్య, – ఏదికొనాలోతోచింది కాదు రాజుకి. కాలక్షేపానికి ఏదో చౌకబారు సాహిత్యం! చదవాలిగా! చేతికొచ్చిన పుస్తకాన్ని తీసి అర్ధరూపాయి చిల్లర చేతిలో పెట్టి తన చోటులోకూర్చున్నాడు.

పేజీలు తిరగేస్తున్నాడు. కానీ దృష్టి పుస్తకంమీదకు మళ్లడంలేదు. ఎదురుగా ఉన్న ఎర్ర చీరమీద పడింది.

ఏకాంతంగా ఓ అమ్మాయి ఎదురుగా కూర్చునిఉంది. చేతిలో మరచెంబు, పక్కన బెడ్డింగు; మరోచిన్నసంచి. ఎర్రటి జార్జెటు సిల్కుచీర, ఊదారంగుజాకెట్టు, మెడలో నెక్లను, సన్నగా, ఎర్రగా, నాగరికత అబ్బిన అమ్మాయిలాగే కన్పిస్తున్నది. బెడ్డింగు పక్కగా కూర్చుని ఏమీతోచక దిక్కులు చూస్తోంది.

పుస్తకాన్ని చదవడం ఆపేశాడు రాజు. అమ్మాయిని తీక్షణంగా చూస్తున్నాడు.

ఈ వ్యవహారం అమ్మాయి కనిపెట్టింది. ముఖం పక్కకు త్రిప్పుకుంది.

పెద్ద షాక్ తగిలినట్టయింది రాజుకి.

యింతలో మెయిల్ వచ్చే వేళయింది. ప్రయాణీకులుకూడా హడావిడిగా సామానుసర్దుకుని బండికోసం ఎదురు

చూస్తున్నారు. ఆ మ్మాయి కూడా బెడ్డింగు ఒక చేత్తోను, సంచీ మరచెంబూ ఒక చేత్తోనూ పట్టుకుని నిలబడింది. రాజు కూడా తన ప్రయత్నంలో తానున్నాడు.

యింతలో బండిరానే వచ్చింది. దిగేవారు దిగుతున్నారు. ఎక్కేవారు ఎక్కుతున్నారు. ఆ అమ్మాయి ఓ చిన్న కంపార్టుమెంటులోనికి ఎక్కింది. రాజు నెమ్మదిగా ఆ పెట్టిలోనికే ప్రవేశించేడు. అమ్మాయి ఓమూలగా కూర్చుంది. అదృష్టవశాత్తూ దగ్గరగానే చోటుదొరికింది రాజుకి. అమ్మాయికి ఎదురుగా ఆశీనుడయ్యాడు. బండికదిలింది.

'చిత్రమైనది విధినడతా' అంటూ పాడుతున్నాడు ముష్టివాడు. 'తాజాకజా-చాలా మజాగా ఉంటాయి అణాకి రెండు అని అరుస్తున్నాడు ఓ అర్భకుడు.

రాజు నాలుగు కాజాలు కొనుక్కున్నాడు. అమ్మాయివంక చూస్తూనే తింటున్నాడు. తింటూంటే దాహంవేశింది రాజుకి. అమ్మాయి చేతిలోఉన్నమరచెంబు గుర్తుకువచ్చింది.

"కాశిని మంచినీళ్లుయిస్తారా? "నిర్భయంగా అడిగేడు అమ్మాయిని.

యివ్వక తప్పిందికాదు అమ్మాయికి. మర చెంబు చేతికి అందిచ్చింది.

గబగబా కాళీచేశాడు మరచెంబుని. 'తేంక్సు' అంటూ తనచోటులో కూలబడ్డాడు.

ఆ కంపార్టుమెంటులో జనం మరీ రద్దీగా ఉన్నారు. ఓ అనాగరికవ్యక్తి త్రోసుకుంటూ వచ్చి అమ్మాయి పక్కనే కూర్చున్నాడు. జానెడు చుట్టనువెలిగించి అమ్మాయి వైపు పొగ దట్టంగా వదుల్తున్నాడు. ఆ పొగకు ఉక్కిరిబిక్కిరై ముఖాన్ని జేబురుమాలుతో దాచుకుంది. మరో ప్రక్క కూర్చున్న యువకుడు అమ్మాయి వంకచూస్తూ పళ్లికిలిస్తున్నాడు. ఎదురుగా కూర్చున్న ముసలాయన అమ్మాయి అవస్తనుచూసి జాలిపడ్డాడు. చుట్టకాల్చే వ్యక్తిని రాజు గదమాయిద్దామనుకున్నాడు కానీ పక్కస్టేషనులోనే ఆ వ్యక్తి దిగిపోవడంవల్ల తన ప్రయత్నాన్ని విరమించవలసివచ్చింది.

ఒంటరిగా ఒక స్త్రీ ప్రయాణంచేస్తే ఆమె పాట్లు భగవంతుడికే తెలియాలి. ఒకరు ఈలవేస్తారు. మరొకరు పళ్ళికిలిస్తారు. వేరొకరు పొగఊత్తారు.

ఛీ! పాడులోకం!

రాజు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. యింతవరకూ తాను చేసిందేమిటి? ఏకాంతంగా ప్రయాణంచేస్తున్న అమ్మా

యిని అనుసరించేడు. పట్టింపుగా ఆమెకు దగ్గరగా కూర్చున్నాడు.

యిదంతా ఎందుకు ?

తానేమైనా ఆ యువతిని ఆశిస్తున్నాడా? అటువంటి దురాలోచన తనకులేదు. అందమైనవస్తువు కన్పిస్తే దానిని చూడడం వరకే ప్రతివానికీ హక్కుఉంది. అనుభవించడానికి హక్కులేదు.

తానూ అంతే.

అందమైన అమ్మాయి కన్పించింది. చూశేడు. యిందులో తప్పేముంది ?

తాను అనాగరిక వ్యక్తిలా అమ్మాయి ముఖంమీద పొగ ఊదలేదు.

రౌడీలా అమ్మాయినిచూసి పళ్ళికిలించలేదు.

తనలోతాను సమాధానపర్చుకున్నాడు రాజు.

బండి ఓ స్టేషనులో ఆగింది.

ఆమెకు దాహంవేసినట్టుంది. మరచెంబుమూత తీసుకుని చూసింది. నీళ్లు లేవు.

అమ్మాయి అవస్థను అర్థం చేసుకున్నా రాజు.

"మంచినీళ్లు తెస్తాను మరచెంబు యివ్వండి" దగ్గరగావెళ్లి అడిగేడు.

అమ్మాయి మాట్లాడలేదు. మౌనంగానే మరచెంబు చేతికి అందిచ్చింది.

రాజు చెంబునిండా నీళ్లు తీసుకువచ్చేడు. ఆమె చేతికి అందిచ్చేడు.

'తేంక్స్' అంటూ పుచ్చుకుంది.

రైలు కదిలింది.

అమ్మాయి దాహం తీరింది.

రాజు సంతృప్తిపడ్డాడు.

ఇంతకు పూర్వం తనకు దాహంవేస్తే అమ్మాయి సహాయాన్ని అర్థించేడు. యిప్పుడు అమ్మాయికి తన సహాయాన్ని అందజేశాడు.

రైలు రాజమండ్రి స్టేషనులో ఆగింది. సామాను చేత్తోపట్టుకుని అమ్మాయి దిగిపోయింది.

ఆమెవంకచూస్తూ ఆలోచిస్తున్నాడు రాజు. నెమ్మదిగా అమ్మాయి నడిచి పోతోంది. దూరంగాపోతూ రాజు కంటికి అదృశ్యమైంది.